# గాడిదలూ – గంధపుచెక్కలూ

"గుడ్‌మార్నింగ్ మిసెస్ విమలా !"

"గుడ్ మార్నింగ్ మిసెస్ సునీతా !"

"చాలా పెందలాడే లేచి గార్డెనింగ్ ప్రారంభించా వేమిటీ ఈరోజు ?"

"లేదే. రోజూ ఇదేవేళ. ఏమిటో ఉదయమే నాకు ఏ పనిమీదా మనసుపోదు. ఇలా హాయిగా పూలమొక్క-లలో తిరుగుతూ సర్వం మఱచిపోవాలని వుంటుంది."

"అదృష్టవంతురాలవ్. వెనుక చేసి పెట్టేవాళ్ళుంటే అలాగే అన్పిస్తుంది మరి !"

"నా అదృష్టం నువ్వే పొగడాలి. దూరపుకొండల చందం !"

"సునీ !" లోపలినుంచి మూర్తి కంఠం వినవచ్చింది.

"ఓ సునీ ! బెడ్ కాఫీ మేడమ్ !"

"విన్నావుగా ?" అనుజ్ఞ తీసుకుంటున్నట్లుగా విమలతో అనేసి, సునీత లోపలికి వెళ్ళిపోయింది.

ఇటు విమలకుకూడా సుప్రభాతం విన్పించింది లోనుండి.

"ఏం విమలమ్మా, కాస్త ఈ కాఫీ త్రాగుతావా ?" అంటూన్న కాంతమ్మ స్వరంలో నిష్ఠురం వినిపిస్తూన్నది.

పేలవంగా నవ్వుకొంటూ వంటింట్లోకి దారితీసింది.

"ఊరందరికీ వున్నారు కోడళ్లు- నాకూ వుంది, ఎందుకూ ? ఏడాదికోసారి వచ్చి చుట్టంలా కూర్చుని ఎదురు చేయించుకోవటానికి" సాధింపులోనే మూలుగును మిళాయించి కప్పూ, సాసరూ నేలపై వుంచింది.

ఆ అగౌరవాన్ని మౌనంగా సహించి కాఫీ చేతికి తీసుకుని బయటకెళ్ళిపోయింది విమల.

అప్పుడే నిద్రలేచి అటుప్రక్కగా బాత్ రూం వైపు వెళ్తూన్న రాధాకృష్ణ ఆ సంభాషణను విన్నాడనేది సర్వ విదితం.

కానీ కాంతమ్మ సాధింపును ఎవ్వరూ ఎదుర్కో లేరనేది కూడా సర్వవిదితమే.

"మనం సెలవులకు వచ్చేంగానీ..." మాట ఎలా పూరించాలో తెలియలేదు, భర్తకు కాఫీ అందిస్తున్న విమలకు.

అతడినుండి ఎటువంటి సమాధానమూ లేదు.

"మామగారికి పంచదార ఎక్కువ పనికిరాదు. అత్త గారికి పంచదారకు బదులు ఏవో మాత్రలు వేయాలి. ఇక మరుదులకు స్ట్రాంగ్ గా చేయాలి. ఇవన్నీ మీాకు గుర్తు

వుండవు. వాళ్ళకు నేను తయారు చేసినది సహించకపోతే అభాసు పాలౌతాను."

"అబ్బబ్బ! దండకం ఆపు విమలా, ఎలాగో నాల్గు రోజులు సర్దుకోలేవూ ?"

విసుగ్గా అనేసి ఖాళీ కప్పు టేబిల్ పై పడవేసి తన షేవింగ్ కోసం వేడినీళ్ళు తెమ్మని ఫర్మాయించాడు.

అంతే అతడి బాధ్యత.

నిట్టూర్పును నిస్సహాయంగా లోలోన అణచుకుంటూ అతడి ఆజ్ఞాపాలనలో నిమగ్నమైంది.

"ఇక నేను స్నానంచేసి పూజచేసుకోవాలి. కాస్త అక్కడ పువ్వులవీ సిద్ధం చెయ్యి. హారతి కుందులూ అవీ తోమి సిద్ధంగాపెట్టు." అత్తగారు మరోపని ఫర్మాయించింది.

అన్నీ పూర్తిచేసి తాను జడవేసుకోవడంలో నిమగ్నమైన విమలకు అత్తగారి మంత్రాలు వినవచ్చాయి. అవి పూజా సంబంధమైన మంత్రోచ్చారణలు కావు.

ఆలస్యంగా నిద్రలేచి వచ్చి బద్ధకంగా ఒళ్ళు విరుచు కుంటూ నిలబడిన సూరీడును తిట్టిపోస్తూన్నది.

"మగవాళ్ళు స్నానాలుచేసి బయటకుకూడా పోయారు, ఆడవాళ్ళు వంటలూ వార్పులూ అన్నీ పూర్తి చేసుకున్నాం. పడ్డనల సమయానికి నిద్రలేచావే, నీ అలవాట్లు తగలడ! రేపు అత్తింట్లో ఇలాగైతే నా ముఖాన పేడనీళ్ళు జల్లుతారు."

అలా సాగిపోతోనే వుంది ఆ దండకం.

సూరీడుకు చీమకుట్టినట్లైనా లేదు. ఒక్కసారి విమల దెస చూచి కన్పించీ కన్పించకుండా నవ్వేసి స్నానాలగది దెస నడిచింది.

ముఖం కడుక్కొచ్చి కాఫీ త్రాగినంతసేపూ తల్లి తిడుతూనే వున్నది.

"చదువులూ, సంధ్యలూ అంటూ స్కూళ్ళకూ కాలేజీలకూ పంపితేనే ఇలా విఱ్ఱవీగుతారని నేను నిన్ను చదివించలేదు. అయినా ఇలా ఏకు మేకై కూర్చున్నావ్; బియ్యేలూ ఎమ్మేలూ తగలెడితే ఇంకా ఎలా తయారయ్యుండేదానివో ఎద్దులాగా..."

"వదిన ఎమ్మే చదివింది కదమ్మా?" సిగ్గు అనే శబ్దమే ఎరగని సూరీడు నెమ్మదిగా అనేసి కిసుక్కున నవ్వేసింది, విమలదెస చూస్తూ.

తాను ఎమ్మే పాసవ్వడం అపరాధమైనట్లుగా విమల తల వాల్చుకున్నది.

"నోర్మూయ్, సిగ్గులేని ముఖానికి నవ్వే సింగారమనీ... ఎమ్మే పాసైంది గనుకనే, నా డాక్టరేట్ కొడుకును వెంట వెంటపడి గ్రద్దలా తన్నుకుపోయింది. సాటివాళ్ళందరికీ లక్షలు లక్షలు కట్నం పలుకుతూంటే నా ముఖాన ఓ పట్టుచీర మాత్రం పడింది ..."

మాటకు మాట విసరటం అలవాటు లేని విమల చటుక్కున లేచి వెళ్ళిపోయింది అక్కడినుంచి.

"వదినచేత జడ వేయించుకుంటాను" అంటూ సూరీడు కూడ విమల వెనుకనే పడింది.

ముభావంగా కిటికీవద్ద నిలబడివున్న విమల ఆడపడుచును గమనించనట్లే వుండిపోయింది.

"అమ్మావాళ్ళమీద కోపం నామీద చూపించకు వదినా ! జడవేద్దూ." దువ్వెన చేతికిచ్చింది. "నువ్వు వేసు కున్నట్లు అందంగా వెయ్యాలి. అమ్మచూడు ఎప్పుడూ బిగించి గడకఱ్ఱలా వుండేట్టు వేస్తుంది. చివర రిబ్బన్ కట్టక పోతే దరిద్రమట !"

నవ్వు వచ్చింది విమలకు.

"ఏమిటో - సెలవులకు అత్తింటికి వస్తున్నాననే సంబరంకంటె జైలుశిక్ష అనుభవించటాని కొస్తున్నట్లు భయపడతాను సూరీడూ నేనూ. అనకూడదు కానీ జూలో జంతువుల్లాగా అందరికీ తలో స్వభావం ఈ యింట."

సూరీడుకు ఆ మాటలు పట్టించుకోవలసిన అవసరం లేదు; ఇంగితమూ లేదు. చెంపలు జుట్టు బాగా ఎత్తుగా ఎగదువ్వుతున్నదా లేదా, జడ అందంగా వదులుగా వస్తోందా లేదా అని చూచుకుంటోంది అద్దంలో.

"అయినా నువ్వెందుకంత ఆలస్యంగా లేస్తావ్ ? త్వరగా నిద్రలేవడం మంచి అలవాటు కాదూ?" మంద లింపుగా అన్నది విమల.

"ఏం చెయ్యను వదినా?" దీనంగా చూచింది సూరీడు. "ఆడవాళ్ళు పుస్తకాలు చదివి చెడిపోతారట. ఒక్క పుస్తకం చదవటానికికానీ, కొంటానికి గానీ వీలు లేదు."

"ఇది నిజంగా అజ్ఞానం- ఈ కాలంలో కూడా యిలా వున్నారంటే..."

"ఔను మరి. ప్రక్కింటి ఇంజనీరుగారి భార్య సునీత లేదూ?"

"ఊఁ."

"ఆవిడదగ్గరలేని పత్రికా, నవలా వుండవు తెలుసా? ఎవ్వరూ చూడకుండా ఆవిడ దగ్గరనుండి గోడమీదినుంచి తీసుకుంటాను. రాత్రిళ్ళు అందరూ నిద్రపోయాక రహస్యంగా చదువుకుంటాను. అందుకే ప్రొద్దున్నే మెలకువ రాదు మరి."

విమల సానుభూతి అంతా కళ్ళల్లోనే కురిసింది.

"వదినా! నన్నూ మీతో తీసుకుపోదూ. ఈ బంధిఖానాలో పడివుండలేక ఛస్తున్నాను. ఇప్పుడంటే నువ్వు వచ్చావు గనుక సరదాగా వుంది. లేకుంటే అబ్బా- నరకం. నాన్నకు పొలం అజమాయిషీ, అమ్మకు ఇంటి పనులకు కావలసినంతమంది నౌకర్లూ, పాలేళ్లూ, వున్నారు కనుక చెప్పరానంత తీరికా హడావుడీ కూడానూ. వెధవ వడియాలూ అప్పడాలూ, పిండివంటలూ నేర్చుకో మంటుంది.

లేదా అమ్మలక్కలు పదిమందీ చేరి ఊళ్లో పెళ్లికాని ఆడ పిల్లల సంగతి ఆడిపోసుకుంటూ వుంటారు."

చాలా ఆలోచించిన మీదట విమల అన్నది, "నిజమే సూరీడూ, అత్తగార్ని అడుగుతాను నిన్ను మాతో పంపిస్తా రేమో ?"

"సరే, నేను మా స్నేహితురాలింటికి వెళ్లి శుభవార్త చెప్పి వస్తాను."

"ఏం శుభవార్తా ?"

"అదే, నువ్వొచ్చావని, ఎమ్మే చదువుకున్న వదిన వున్నది నాకని ఎంత అసూయో తెలుసా వాళ్లందరికీ నాపై? నిన్నో సినిమారాణిని చూచినట్టు చూడటానికొస్తారిక" ఛెంగు ఛెంగున పరుగెత్తిపోయింది.

## 2

విషయం విమలనోట వింటూనే కొట్టిపారవేశాడు అతి తేలికగా రాధాకృష్ణమూర్తి.

"పెళ్ళీడుకొచ్చినదానికి ఇప్పుడేం చదువులే. ఇక, సంబంధాలు చూస్తున్నారుగా?"

అయినా విమల పట్టువదలలేదు.

"కాస్త చదువూ, వ్యాపకం అంటూ వుంటే ఎవరికైనా ఓ పద్ధతీ, శిక్షణా అనేవి తిన్నగా వుంటాయి. చదువులేక

సూరీడు అలా వున్నదంతే. మాతో పట్నం పంపించండి."
అన్నది అత్తగారితో.

పొయ్యిమీద గిన్నెలో వేగుతూన్న పోపుగింజలకంటె ఎక్కువగా చిటపటలాడుతూ కన్పించింది అసహనంగా తలెత్తిన కాంతమ్మ ముఖం.

"అనవసరంగా మాట్లాడబోకు నువ్వు. నీ సలహా లెవరూ అడగలేదు. చదువు పేరిట స్కూళ్ళల్లోపడి మగాళ్ళ వేట చేసుకోవలసిన గతిలేదు నా కూతురికి. శుభ్రంగా కట్నమిచ్చి పెళ్ళిచేయగల తాహతున్నది మాకు."

విపుల అవాక్కుగా అచేతనంగా వుండిపోయింది.

"అలాగుందేమోయ్ ముఖం? తలనొప్పిగాని వచ్చిందా?" అని అడుగుతాడు రాధాకృష్ణ అదేగనుక తమ యింట అయితే.

కానీ ఘనులైన అమ్మగారి ఆధ్వర్యంలో నడిచే ఈ ఇంటమాత్రం అతడి స్వభావం పూర్తిగా భిన్నమైపోతుంది! ఏదీ పట్టనట్టుగా అంటి ముట్టనట్లుగా వుంటాడు.

పాత స్నేహితుల ఇళ్ళన్నీ తిరిగి తిరిగి చుట్టబెట్టి వచ్చాడేమో అలసి సొలసి — అమ్మ ఆప్యాయంగా వడ్డించిన అన్నం సుష్టుగా ఆరగించి హాయిగా పవ్వళించి, అంతలోనే నిద్రకు జారుకున్నాడు.

విపుల నిస్సహాయంగా అతడినే చూస్తూ ఈజీచైర్‌లో కూలబడింది.

తాను అన్నం తిన్నదో లేదో కూడా అత్త అడగలేదు.

అత్త సూటిపోటి మాటలు తనకు ఆకలిని చంపి వేశాయి.

అంతా భోజనాలు ముగించి పగటి నిద్రల కుపక్ర మించారు! మామగారు సీతారామయ్యకూడా పొలంనుంచి వచ్చి నడుం వాల్చాడు.

'ఎదిగినపిల్ల సూరీడు ఇంకా కొంపకు జేరుకోలేదనే సంగతే ఎవళ్ళకీ పట్టదేం? పట్టి సాధింపులేకాని పెంపకం పద్ధతి తెలియదు కొందరికి, ఎంత పెద్దయినా సరే వయసులో.' అనుకున్నది, నిద్రరాక ఆలోచనలతో సతమతమౌతూన్న విమల.

'ఇంతకూ సూరీడు ఒకవేళ తన గదిలో గప్‌చిప్‌గా ఏమైనా చదువుకుంటూ కూర్చున్నదేమో?'

ఈ ఆలోచన రాగానే మేడమీది సూరీడు గదికి దారితీసింది విమల.

పాతకాలపు పెద్ద భవంతి.

భవనానికి తగినంత జనాభా లేక కొన్నిగదులు పాత సామానులతోనూ, మరికొన్ని అలా ఖాళీగా నిరుపయోగం గానూ పడివున్నాయి.

అంతా నిశ్శబ్దంగా వున్నది. అక్కడక్కడ బయటినుండి విన్పించే కాకుల అరపులూ, పిచ్చుకల కువకువలు మినహా.

సూరీడు గది గొళ్ళెంపెట్టి వున్నది బయట.

అనాలోచితంగానే గొళ్ళెంతీసి లోపల ప్రవేసించింది విమల.

ఈ తరవు ఆడపిల్ల గదిలా లేదది అసలు.

శుభ్రత అనేది ఏ కోశానా కన్పించటం లేదు.

పక్కా, పరుపూ దిఖ్ఖా సర్దబోయిన విమల నాగు బాముసు చూచినట్టే అదిరిపడింది. క్షణకాలం నివ్వెరపోయి నిలబడింది.

పరుపు అడుగున దాచివున్న పుస్తకాలు పైన బొమ్మలే ఎంతో ఘోరంగా ఉన్నాయి.

ఒక్కొక్కటే తిరగేసి చూచిన విమల శరీరంపై గొంగళిపురుగులే ప్రాకినట్లయింది.

వివాహిత స్త్రీగానీ, విజ్ఞానమూర్తి అయిన వైద్యు రాలుగానీ తన భర్త ఎదుటైనా ఆ పుస్తకాలను కన్నెత్తి చూడటానికి కూడా సిగ్గుపడవలసినట్లున్నాయి అందలి బొమ్మలూ, వ్రాతలూ.

అమాయక వయసులో వున్న సూరీడుకు సునీత యివ్వ దగిన పుస్తకాలేనా యివి?

సునీతపై అపరిమితమైన ఆగ్రహంతో, నాలుగూ దులిపేద్దామనే దృఢనిశ్చయంతో బయలుదేరింది విమల.

"దా దా, ఒంటరిగా ఫీలౌతున్నాను." ఆప్యాయంగా ఆహ్వానించిన సునీత పలుకులు విమలకు శ్రావ్యంగా విన్పించ లేదు. కడుపులో మంట కుతకుతమంటూన్నదాయే!

తను పమిటచెంగుచాటున దాచి వుంచిన పుస్తకాలను విసురుగా సెంట్రల్ టేబిల్‌పై గిరవాటువేస్తూ సునీత కనుల లోనికి తీక్ష్ణంగా చూచింది.

అర్థంకాని సునీత పుస్తకాలనూ, విమలనూ మార్చి మార్చి చూడసాగింది అయోమయంగా.

"సాటి యువతిని ఎందుకిలా తప్పుడు మార్గంలోని కీడ్చుతున్నావ్ సునీతా? నువ్వా చదువుకున్న విజ్ఞానవంతు రాలవేకదా" అరుణిమ కురుస్తూన్న నేత్రాలతో అడిగింది విమల.

"నాకేమీ అర్థంకావటంలేదు నీ మాటలు." బిత్తర పోతూ అన్నది సునీత.

"ఈ పవిత్ర గ్రంథాలను నీవు మా ఆడపడుచుకు ఏ సదుద్దేశంతో ఇచ్చావని అడుగుతున్నాను?" విమల కంఠంలో తీవ్రత తగ్గలేదు.

"ఇవి..." సునీత భృకుటి ముడిపడింది. ఆ పుస్తకా లను తిరగా, బోర్లావేసి చూసి, అంటరాని వస్తువును చూచి నట్లే విసరివేసి చేతులు కడుక్కొచ్చి కూర్చున్నది.

ఎవరి ఆవేశాలను వారు దిగమ్రింగు కుంటూండగా అయిదు నిముషాలు మ్రింగుడు పడిపోయాయి.

"అయితే ఇవి తనకు నేనిచ్చానని సూరీడు చెప్పిందా?" తనను తాను సంభాళించుకుంటూ వీలైనంత శాంత స్వరాన అడిగింది సునీత.

'ఔ' నన్నట్లు తల పంకించింది విమల.

"ఇలా రా" అంటూ ఇద్దరూ వీధి వరండాలోనికి దారి తీశారు.

"వీధి చివర ఆ మూలన కన్పిస్తూన్న కిళ్ళీకొట్టున్నది చూచావా?" సునీత అడిగింది.

"అయితే?"

"ఈవాళ చదివి రేపు యిచ్చేయటానికి ఒక్క పుస్త కానికి పది పైసలు తీసుకుంటాడు వాడు. అవ్వటానికి ఇది పల్లెటూరే, కాని ఇక్కడే ఇటువంటి కామచరిత్రలు అధికం"

ఆశ్చర్యంగా చూడసాగింది విమల.

"సారీ విమలా! నీవు నన్ను అనుమానించకపోతే ఇవన్నీ నేను బయట పెట్టకపోదును. కానీ మన స్నేహం నిలవ టానికి నేను అబద్ధం చెప్పడం లేదు తెలుసా?"

"ఛ! సారీ, వెరీ వెరీ సారీ సునీతా."

"పోనీగానీ...ఇటు రా."

ఇద్దరూ సునీత పడకగదిలోనికి దారితీశారు. చిన్న దైనా పొందికగా, తీరువగా అమర్చబడిన ఇల్లు. ఒక ప్రక్క చిన్న పుస్తకాల రాక్. బెడ్, సైడ్ టేబిల్‌పైకూడా కొన్ని పుస్తకాల దొంతి వున్నది.

'చూశావా మా అభిరుచులు!' అని సునీత సవాలు చేస్తూన్నట్లుగా కన్పించాయి ఒక్కో పుస్తకంమీదా వున్న ఉన్నతమైన రచయిత్రీ రచయితల నామధేయాలు.

సిగ్గుతో వాలింది విమల శిరస్సు.

"మనిద్దరం స్నేహితులంకదా అనీ, నువ్వు ఇంతగా ఆరా తీయవనీ అనుకుని అలా చెప్పివుంటుంది మీా ఆడ పడుచు. పోనీలే మరచిపోదాం."

ఇప్పటికీ విమల తల పైకిలేవలేదు. "విమలా!" ఆర్ద్రతగా పిలిచింది సునీత.

'ఏమి' టన్నట్లు చూచింది విమల.

"మీా సూరీడు ఏమైపోతుందో ఆఖరుకు ఏ గతికి వస్తుందో నాకేం అర్థం కావటం లేదు. అటువంటి పుస్తకాలు నౌఖర్లచేత ఆ దుకాణం నుంచి రహస్యంగా తెప్పించుకుంటుంది. తల్లి కోడిగుడ్లూ, ధాన్యంవగైరా అమ్మిన డబ్బులు తస్కరించుతుంది ఈ ఘనకార్యం కోసం."

విమల నేత్రాలు కదలికను మఱచి వినసాగాయి.

"చీకటి పడబోయేసరికి ఈ వయసు పిల్లను యింట వదలి తండ్రి చతుర్ముఖ పారాయణానికి పోతాడు- లేదా భోగం కొంపలకు పోతాడు..."

"అది కూడానా మా మామగారికి ?" ఉలికిపాటుతో అడిగింది విమల.

"ఆహా ! వుంటావుగా పదిరోజులు? అన్నీ నువ్వే చూస్తావ్, గ్రహిస్తావ్. ఇక ఆ తల్లి – ఘనత వహించిన మీా అత్తగారు గుళ్ళో పురాణం అని ఒక

నాడూ, ఎవరింట్లో హరికథ అని ఒకనాడూ, లేదా ఏ పుట్టింటి బంధువో చచ్చిన పరామర్శకని మరోనాడూ వెళ్ళిపోతుంటుంది. మరి ఈ పిల్ల ఇలా చెడిపోక ఏమౌతుంది? ఇంట్లో వున్నప్పుడైనా పిల్ల ముఖం చూచే తీరికేదీ ? మగ వాళ్ళకు తెలీకుండా ధాన్యం వగైరా అమ్ముకోవడానికే టైము చాలదు ఆవిడకు."

విమల వద్ద సమాధానం లేదు.

"ఏమి టాలోచిస్తున్నావ్?"

"ఈ ఇంటి కోడలినై వుండీ, ఈ ఇంటి పరువు దిగజారకుండా నే నేమీ చేయలేనా అని ఆలోచిస్తున్నాను."

"చెయ్యలేవు." ఘంటాపథంగా నొక్కి వక్కాణించింది సునీత. "వాళ్ళంతా వాళ్ళే చాలా గొప్పవాళ్ళమనీ, జ్ఞానులమనీ, వాళ్ళ వయస్సును చూచి మనం వాళ్ళకు మ్రొక్కాలనీ అనుకుంటారు. వయస్సు అదుగో— ఆ ఊడలు దిగిన మఱ్ఱికీ వున్నది-ఎప్పటినుండి నిలబడి వున్నదో ఎవరికీ తెలియని ఆ పర్వతానికీ వున్నది."

"............"

"మీ అత్తవారిని అంటున్నానని కోపమా?"

"కాదులే సునీతా! నాకు తెలుసుగా వాళ్ళ బుద్ధి? నేను హరికథలు విననసీ, నోములూ, వ్రతాలూ చేయనసీ రకరకాలుగా నిందిస్తారు మా అత్తగారు. కానీ ఒంటరి కాపురాలలో గడియారంముళ్ళు చూచుకుంటూ నిముష

నిముషం పరుగెత్తాల్సిన ఈ కాలంలో ఇవి ఎంతవరకూ సాధ్యం అని ఆలోచించరు. ఆనాటి బలమైన ఆహారాలతో వాళ్ళున్నంత నల్లరాళ్ళల్లాగా మనం బలంగా లేకపోగా నిత్య రోగాలతో వెనక ఆసరాలేక ఎలా అల్లాడిపోతుంటామో గ్రహించరు."

"ఔను. అన్నట్టు... నీవూ మీ వారూ ప్రేమ వివాహం చేసుకున్నందుకూ_డా ఆవిడ అనుక్షణం సాధిస్తూనే వుంటుంది కదూ? ప్రొద్దున్న ఏవో విన్పించాయిలే నాకు."

"ఆఁ. డాక్టరేట్ కొడుకును నా కారణంగా లక్షలకు అమ్ముకోవటం వీలుపడలేదట."

"ఎప్పటికి బాగుపడ్తుందోయ్ మనసమాజం విమలా?" సునీత నిస్పృహగా అన్నది.

"ఏకంగా ఏ భూకంపమో వచ్చి మళ్ళీలా క్రొత్త ప్రపంచం పుట్టాలేమో?"

హఠాత్తుగా మాటలు ఆపేసి సునీత దృష్టిని కేంద్రీకరించిన దిశగా తానూ చూపులను త్రిప్పింది విమల.

హుషారుగా జడను మెలివేస్తూ, తిప్పుతూ గెంతుతూన్నట్లుగా - పదిమంది నడిచే రోడ్డుపై ఒక ఆడపిల్ల నడవరాని విడ్డూరపు విధంగా నడిచి వస్తోంది సూరీడు. చాలా హుషారుగా వుంది ముఖం. చేతిలో ఏవో పువ్వులూ, పుస్తకాలూ. సాయంత్రం ఆరున్నర కావస్తున్న సమయం అది. సంధ్యచీకట్లు అలుము కుంటున్నాయి ఎల్లెడలా.

"ఎక్కడికి వెళ్ళావే?"

గుమ్మంలోనే ఎదురైన తల్లి ప్రశ్నకు "వాళ్ళ రమణ గారింటికి" అని చెప్పేసి లోనికి జారుకున్నది సూరీడు.

"రామాలయంలో రుక్మిణీకళ్యాణం చదువుతున్నారు. నే నలా వెళ్ళొస్తా. ఇల్లు జాగ్రత్త." కాంతమ్మ వెళ్ళిపోయింది, "కోడలు మహాతల్లి ఏ పెత్తనాలకు పోయిందో ఇంట్లో లేదు." అని కూడా అన్నది మరో అడుగు వేశాక.

హుషారుగా ఇంట్లోకి పరుగెత్తిన సూరీడు రెండు నిముషాలలోనే బయటికి వచ్చి ఒక పాలేరుచేత ఏదో చీటీ వుంచి పంపించడం అంతా గమనిస్తూనే వున్నారు సునీతా, విమలా, సునీత డ్రాయింగ్ రూం నుంచి.

"చూశావుగా విమలా అంతా? వెళ్ళి ఎవ్వరూ నీరాక గమనించకుండా మేడమీద ఏ మూలనో నక్కి జరిగేదంతా గమనించు అంతే. నోరుమాత్రం విప్పకు. అభాసుపాలౌతావు. నువ్వ యింటి కోడలివి. వాళ్ళమీద నేరాలన్నీ నీ మీద నెట్టి నీ కాపురంలో నీళ్ళు పోయగల సమర్థులు."

మరీ మరీ హెచ్చరించి పంపింది సునీత విమలను.

# 3

గబగబా స్నానం ముగించి ముస్తాబై సూరీడు అలా తన గదిలోకి వెళ్ళటమూ, అదే సమయంలో ఎవరు బలిష్ట

మైన యువకుడుకూడా పిల్లిలా వచ్చి ఆ గదిలోదూరడమూ, వెంటనే తలుపులు మూసుకోవడమూ జరిగిపోయింది.

'ఏమి చూస్తున్నది?'

'ఏమిటి జరుగుతూన్నది?'

విమలకు కళ్ళుతిరిగి పడతానేమో ననేంత భయం కలిగింది. కిటికీలో నుండి చూచిన దృశ్యం భరించలేనట్లుగా మరలా వెనుకకు పరుగెత్తి క్రీనీడన నిలబడింది. పదహారేళ్ళ సూరీడు! ఎంతటి... ఏ మాటతో పూరించాలి? ఏ ఉప మానం సరిపోతుంది ఆమెకు?

అరగంట తర్వాత తలుపులు తెరుచుకున్నాయి. అటూ యిటూ దొంగలాగా చూచి వెళ్ళిపోతూన్న ఆ పురుషుని గుర్తించింది విమల. అతగాడు సీతారామయ్యా పాలేళ్ళందరి పైనా పెత్తనం చేసే పెద్దపాలేరు.

"ఛీ."

# 4

"చూశావుటే? ఆ వెంకట్రామయ్యగారి కూతురు శాంతలేదూ... ఎవడో దాని కాలేజీవాడినే పెళ్ళి చేసు కొందట! తల్లీ, తండ్రీ అంగీకరించారట. దిక్కుమాలిన 'లవ్వు.' పిళ్ళ 'లవ్వులు' తగలెయ్యా. మరీ ఆట అయిపోయింది ఈ రోజుల్లో?"

"ఎట్టెట్టా?"సంబంధీకులు ఎవళ్లో చచ్చినట్లుగా చెంపన చేయి వేసుకు వుండిపోయింది కాంతమ్మ కొన్ని క్షణాలు, భర్తమాటలు విని.

"ఆ బుద్ధితక్కువది చేసినపనికి అమ్మా,అయ్యా అంగీకరించారా? కలికాలం!" వ్యాఖ్యానించింది.

ఆ వ్యాఖ్యానంలో తనపై కువిమర్శ దాగివున్నదని విమల గ్రహించకపోలేదు.

అయితే లోగడ బాధపడినట్లుగా ఈరోజు బాధపడలేదు విమల. 'కళ్ళున్న కబోదులు మీరు, తమ నలుపెరుగని గురివిందగింజలు. మీదీ ఓ బ్రతుకులేనా?' లోలోన ఛీత్కరించుకుంటూ తన ఆధిక్యానికీ, ఆత్మవిశ్వాసానికి మురిసిపోయింది.

'విద్యవున్నవారు విచక్షణను పాటిస్తారనేది సత్యమా? సూరీడువంటి మూర్ఖులు ఎక్కువ తప్పటడుగులు వేస్తారనేది సత్యమా? అది ఈ మూర్ఖులు అసలు గ్రహించగలరా?'

"అన్నట్టు... రుక్మిణీకళ్యాణం... బాగా చెప్పారా పంతులుగారు?" సీతారామయ్య ప్రశ్న.

"ఆహా!" ఉబ్బితబ్బిబ్బైపోతూ, చారుకు బదులుగా పెరుగువడ్డించేస్తూ వర్ణన ప్రారంభించింది అభినయంతో సహా కాంతమ్మ.

"పార్వతీశం పంతులుగారు ఏ పురాణమైనా చెప్ప

టమూ, దానికి తిరుగు వుండడమూ కూడానా? ఆహా! రుక్మిణి కృష్ణుడికి సందేశం పంపుతుంది చూశారూ బ్రాహ్మడి చేత? ఎంత మధురంగా వుంటాయి ఆ పద్యాలు అమృతం కదూ?”

“ఔనౌను. మనమ్మాయి పెళ్ళిలో ‘సీతారామ కళ్యాణం’ ఓనాడూ, ‘ద్రౌపదీ పరిణయం’ ఓనాడూ చెప్పించుదాం. ఆహా! కుంతీదేవికి బలమైన ఆర్గురు కుమారులు. ఏమి అదృష్టం? భారతం విన్నకొద్దీ తీపికదూ?”

విమల సూరీడు దెస అలవోకగా చూచింది.

ఆ పిల్ల ఏదో తనలోకంలో తేలిపోతూన్నట్లుగావున్నది.

“ఓ!” తేలుకుట్టినట్టే వులికిపడింది కాంతమ్మ

“అన్నట్టు మధ్యాహ్నం ఏదో ఓ కవరు వచ్చిందండీ. మీరూ అబ్బాయీ ఎవరూ లేరు చదివించుకోడానికి.” అంటూ అప్పుడు తీసిచ్చింది.

“ఓ!” చదువుతూనే సీతారామయ్య మొహం విప్పారింది. “ఆ గుడివాడ వాళ్ళు ఉత్తరం రాశారు. కట్నం సొమ్ము డెబ్భైవేలూ, బంగారం, వస్తుసామగ్రి మరో అరవై వేల వరకూ అనీ, పెళ్ళి ఘనంగా జరపాలనీ...”

“ఓస్. అంతేకదా? మనకెందరున్నారుగనుక? అదొక్క ఆడపిల్ల. అంగరంగ వైభోగంగా—నాలుగు లక్షలిచ్చైనా

చేస్తాం" సగర్వంగా అంటూ కోడలి దెస ఓ చూపు విసిరింది కాంతమ్మ.

సిగ్గుతో మెలికలు తిరిగిపోతూ, ముఖం చేతులలో దాచుకుంటూ తన గదిలోకి పారిపోయింది సూరీడు అతి అమాయకురాలిలాగా, ముగ్ధలాగా.

ఆ నటన చూచిన విమలకు ఎంతైనా అసహ్యం వేసింది.

"ఇంతకూ అమ్మాయిని ఓ మాటు కనుక్కో-" సీతా రామయ్య లాంఛనప్రాయంగా అన్నాడు.

"చాల్లెండి. ఎవళ్ళైనా వింటే నవ్విపోతారు, మీ మాటలూ మీరూనూ." ఈసడించి పారేసింది కాంతమ్మ. "మన యింటా వంటా లేవు ఆడపిల్లలు నోరెత్తడమనేది పెళ్ళి విషయంలో. రాధాకృష్ణగాడు ఏదో అప్రాచ్యపు పని చేశాడేగానీ మన వంశంలో ఏ మగవాళ్లు మాత్రం వాళ్ళకి వాళ్లు పిల్లని ఎంచుకు ముడిపెట్టుకున్నారు చెప్పండి? తలి దండ్రుల మాటప్రకారం పెళ్ళిళ్లు జరగడమే మన వంశా చారం. అయినా అభం శుభం తెలియని పదహారేళ్ళ పిల్ల- అదేం చెప్తుంది? తొమ్మిదింటికైనా నిద్రలేవలేని పసికూన- అత్తింట ఎలా వేగుతుందో. ఎలా నెగ్గుకొస్తుందో ఏమో నా ఒక్కగానొక్క బంగారుతల్లి!"

అప్పటికప్పుడే పెళ్ళి అయిపోయి అంపకాలు పెట్టేస్తు న్నట్లుగానే కళ్ళు ఒత్తుకుంటూ ముక్కు చీదేస్తోంది కాంతమ్మ.

ఎంతైనా అసహ్యం వేసిన విమల మెల్లగా అక్కడి నుండి తప్పుకొన్నది.

తన గదిలోకి వెళ్ళబోతూంటే సూరీడు గదిలోనుండి అస్పష్టంగా మాటలు వినవస్తున్నాయి.

"అమ్మాయిగోరూ! అయితే పెళ్ళై వెళ్ళిపోతావన్న మాట!" పురుషకంఠం.

"నీకు మంచి బట్టలూ, ఈనామూ దొరుకుతాయిగా?" సూరీడు కంఠం.

"అంతేనా?"

"పిచ్చివాడా? పెళ్ళైతే ఏంటి? పుట్టింటికి వస్తూ పోతూ వుండనూ? అప్పుడు..."

"అద్గదీ. అలాగన్నావ్ బాగుంది. నా బంగారు చిలక నెలకోపాలైనా నాకు బగుమతీ ఇవ్వకపోతే ఎలాగా?"

వాళ్ళు దూరంగా వుండి మాట్లాడుకోవడం లేదు.

గుడ్డివెలుతురులో వాళ్ళ హద్దులు మీరిన చేష్టలన్నీ కిటికీనుండి విమలకు కన్పిస్తూనే వున్నాయి.

'ఛీ ఛీ! ఇది-ఈ టక్కులాడి-అభం శుభం తెలియని పసిడి కన్నవాళ్ళకి!'

# 5

“ఆట్టే ఆలోచించి బుఱ్ఱ పాడుచేసుకోకు విమలా” అంతా విన్న సునీత ఓదార్చింది. “ఒక తరహా మనుషులు అంతే. కుష్ఠువ్యాధికంటె భయంకరులు వాళ్ళు.”

“ఆశ్చర్యం సునీతా. నేనూ రాధాకృష్ణా ఒకచోట చదువుకున్నాం. ఎంతో స్నేహంగా తిరిగాం నాలుగేళ్లు. ఏనాడూ హద్దులు దాటలేదు. చదువులు పూర్తి అయ్యాక మా పెద్దల అనుజ్ఞ అయిష్టంగానే అనుమతించారనుకో— అయినా వాళ్ళ అంగీకారం పొందే వివాహం చేసుకున్నాం. అయినా నేటికీ సాధిస్తూనే వుంటుంది మా అత్త. మరి నేడు తన కూతురు?”

“ఏముందీ?” తేలికగా, అల్పంగా నవ్వేసింది సునీత, “లక్షలతో ఘరానా యింటి కోడలౌతుంది. చాటు మాటుగా పాలేళ్లూ, ఇంటి నౌఖర్లూ జీవితాంతం వుంటూనే వుంటారు అటువంటి వాళ్ళకు. మరి అటువంటి సంసారాలేగా కారణం తెలియకుండా ఐశ్వర్యమంతా హరించుకు పోయేది? అంటే అంతా దోడ్డిదారిన ఆ నచ్చిన ప్రియుడి యింటికి చేరి పోతాయి. ఇవీ కొన్ని గొప్పయిళ్ళ చరిత్రలు.”

“అవన్నీ ఎలాగో ఏడవనీ” విసుక్కుంది విమల. “అటు రుక్మిణి కృష్ణుణ్ణి ప్రేమించి పెళ్ళాడింది—ఇటు ద్రౌపదికి అయిదుగురు భర్తలూ— అటు రాముడు సీతకోసం వెర్రెత్తి—

పోయారు. అంటూ పురాణ ప్రేమకావ్యాలు విని, పడిచచ్చే ప్రబుద్ధులు నేడు ఒక జంట తమ స్వంతనిర్ణయాలతో, అంగీకారాలతో దంపతులైతే పరిహసిస్తా రెందుకని?"

"ఏముందీ? వెరీ సింపుల్. గాడిదలను బరువులు మోయటానికి ఉపయోగిస్తారు. గాడిద వీపుమీద గంధం చెక్కలు మోసినంతమాత్రాన ఆ సుగంధం దానికి వీసమంతైనా అంటుతుందా?"